

# వారసత్వం

తాళ్లూరు నాగేశ్వరరావు

చంద్రం బి. ఏ. ప్యాసైనాడు. గడియారం గంటలు కొట్టినంత సహజంగాకాదు; నువ్వులనుంచి నూనె వచ్చినంత కష్టంతో. అతడు బి. ఏ. చదవడానికి తండ్రి మల్లయ్య తన కాళ్ళ సత్తువనూ, వొంట్లోని చెమటనూ, సంసారంలోని చమురునూ కర్చుపెట్టాడు కరిగిన కొవ్వొత్తిలా. ఫలితం: చంద్రం పట్టభద్రుడు కావడమూ, మల్లయ్య రిక్షా టైర్లు ఆరుమాసాల కొకసారి మార్చ వలసిరావడమూ.

కాని ఏంప్రయోజనం? – కొవ్వొత్తి పదార్థం వృధాకావడమూ, రిక్షాటైర్లు అరిగిపోవడమూ, కుటుంబంలో ఆర్థిక దుస్థితి నాలుకలు చాచటమూ తప్ప!

చంద్రం బి. ఏ. ప్యాసై రెండేళ్ళయింది. ఈ రెండేళ్ళలో మూడుపదుల ఆఫీసులమెట్లు చాయవెన్నల్లాంటి ఉత్సా

హంతో ఎక్కి చిక్కనిచీకటిలాంటి నిరుత్సాహంతో దిగాడు. ప్రభుత్వమూ, ప్రైవేటురంగమూ, పబ్లిక్కురంగమూ, దానకర్ణులూ, దీనజన బాంధవులూ — ఎవ్వరూ అతనికి ఉద్యోగాన్నిచ్చి యింత పుణ్యాన్ని మూటగట్టుకోలేదు. దీపం చుట్టూ తిరుగుతూన్న పురుగులా కమిలి పోయా ద త ను, మా డి పో యి న మొహంతో, వాడిపోయిన మనస్సుతో.

"నాన్నా! నా చదువుమీద నువ్వు పెట్టిన పెట్టుబడంతా దండుగ. నేను పడ్డ శ్రమకూడా వృథాయే! నాకు ఉద్యోగం రాదు! నేనూ నీలా గే రిక్షా తొక్కి కుటుం బానికి సాయపడతా!" అన్నాడు ఓరోజు ఉదయం తండ్రితో— ఇన్నాళ్ళూ ఉద్యోగం చేసి తండ్రిని రిక్షా తొక్కే శ్రమనుంచివిడు దలచేసి, పెళ్ళీడుకొచ్చిన చెల్లెలికి పెళ్ళి చేయాలనే కొండంత ఆశతోవున్న చంద్రం.

"ఛీ, ఛీ; రిక్షాతొక్కడానికి బి. ఏ. చదవాలటరా! రిక్షావాడికొడుక్కి రిక్షా తొక్కేరాత తప్పించాలనేగా ఇన్నేళ్ళ నుంచీ నేను రిక్షాతొక్కుతూ నిన్ను చది వించింది. ఓపికపట్టు. ఉ ద్యో గ ం దొరక్కపోదు," అన్నాడు మల్లయ్య సహజమైన ఆశావాదిధోరణిలో.

ఇంతచదువూ చదవడం ఒకబాధ; ఆపైన ఉద్యోగంకోసం వీధిదీపంలా కన్ను ఆర్పకుండా ప్రయత్నించడం మరోబాధ; ఏ ఉద్యోగమూ దొరక్క పోవడం ఇంకోబాధ; 'ఇంకా ఉద్యోగం లేదుటోయ్!' అంటూ తెలిసినవాళ్ళు తెలిసికూడా వ్యంగ్యంగా ప్రశ్నించడం ఆ మూడుబాధలనూ మించినబాధ; బి. ఏ. చదివి రిక్షాపై కాళ్ళుమోపడం అన్నిం టినీ మించినబాధ. ఇన్నిరకాలైన బాధ లతో, బరువైన ఆలోచనలతో, ఉప్పు లేని కూరలాంటి ఊహలతో చంద్రం బ్రతుకుతూనే ఉన్నాడు నిరుద్యోగిగా. మల్లయ్య మామూలుగానే రిక్షా తొక్కుతూ కొడుకు ఉద్యోగాన్నిగురించి రేబవళ్ళూ కలలు కంటూనేఉన్నాడు. చంద్రంతల్లీ, చెల్లెలూకూడా ఆలోచనల ఇంద్రధను స్సులో రంగుల్లా తేలిపోతూనేఉన్నారు.

మబ్బులుపట్టిన ఆకాశంలో, నక్షత్రాలు కనబడని చీకటిలో — మళ్ళీ ఓ మెరుపు మెరిసింది; పిడుగుపడే ఉరుము ఉరిమింది.

ఓ పంచాయతీసమితి ఆఫీసులో ఓ చిన్న క్లర్కుఉద్యోగానికి అడ్వర్టయిజ మెంటు పడింది. చప్పున ఓ దరఖాస్తు తగిలించాడు చంద్రం. కావాల్సిన క్వాలి ఫికేషన్ యస్‌యస్సెల్సీయే. బి. ఏ. ప్యాసై మూడేళ్ళనుంచీ జాతరా జాగారం చేస్తూన్న అతనికి ఇంటర్వ్యూ రావడం అబ్బురమేముంది?

చంద్రం ఇంటర్వ్యూకి ముచ్చటగా ముస్తాబై వెళ్ళేముందు, "ఈసారి నీకు తప్పకుండా ఉద్యోగం వస్తుందిరా!" అన్నాడు తండ్రి మల్లయ్య.

తల్లి ఏడుకొండలస్వామికి ఏడుకొబ్బరి కాయలు కొట్టి ఏడుసార్లు గుడిచుట్టూ ప్రదక్షిణలు చేస్తానని మొక్కుకుంది.

అన్నయ్యకు ఈదఫా ఉద్యోగం రావా

లని ఇష్టదేవతాప్రార్థన చేసింది చెల్లెలు.

'ఈసారి తనకు ఉద్యోగం రాకపోతే తండ్రికి మొహంచూపించడం అనవసరం; ఇంటిగడప త్రొక్కడం వృధా; బ్రతకడమే వ్యర్థాతివ్యర్థం,' అనుకున్నాడు చంద్రం గుండెను కాంక్రీటులా గట్టిపర్చుకుని.

ఇంటర్వ్యూ జరిగింది. ఆఇంటర్వ్యూ బోర్డుకు సమితి అధ్యక్షుడు అధిపతి.

విద్యార్థుల క్రమశిక్షణారాహిత్యానికి కారణ మేమిటి ?

ఈయేడు ఇద్దరు సుప్రసిద్ధ సినిమానటులకు 'పద్మశ్రీ' బిరుదులిచ్చి మనప్రభుత్వం గౌరవించడంలో అంతర్యమేమిటి ?

సహారా ఎడారిలో సంపెంగ మొక్కలు మొలుస్తాయా ?

— అట్లాంటి ప్రశ్నలకూ, తను చేయబోయే ఉద్యోగానికీ సంబంధ మేమిటో అర్థంగాకపోయినా — వొడుపుగా, వినయంగా సమాధానాలు చెప్పాడు చంద్రం. సమితి అధ్యక్షుని చిరుబంతిపువ్వులాంటి చిరునవ్వుకి అతని హృదయంలో ఆశా రేఖ చిటారికొమ్మని మిఠాయిపొట్లంవలె కనబడింది. కాని ఆ ఇంటర్వ్యూ అయిపోయిన అర్థగంటలోనే తెలిసింది — ఆ మిఠాయిపొట్లం తనకోసం ఆ చిటారికొమ్మను అలంకరించలేదని. పి. యు సి. తప్పిన ఓ కుర్రవాడికి ఆ ఉద్యోగం కంఠాభరణంగా కట్టబెట్టబడింది. ఆ కుర్రవాడు సమితి అధ్యక్షుడు ఉంచుకున్న బొమ్మయొక్క బంధువర్గంలోనివాడట

చెల్లెక్కి చేతులు విడువడానికి ఆజీబుగా వున్న చంద్రం మనస్సులో రెండే రెండుప్రశ్నలు పోటకత్తుల్లా పొడుచుకొచ్చాయి. ఒకటి: చావడమా ? రెండు: బ్రతకడమా ?

ఓహోటలుముందు నిలబెట్టిన పోస్టరు బొమ్మలా నిలబడి ఆలోచించుకుంటున్నాడు చంద్రం. అతని మనస్సులో మొదటిప్రశ్నకే సుముఖమైన సమాధానం లభించబోయే సమయంలో అతని దగ్గరకు — గరికదుబ్బులా గడ్డం పెరిగి, కన్నీళ్ళు యింకిపోయిన కళ్ళతో, చిరుగుబట్టిన చొక్కా, ప్యాంటూ ధరించిన ఓ యువకుడు వచ్చాడు. ఓ చిన్న అట్టముక్క చూపెట్టాడు: "నేను ఎం. ఏ. ప్యాసయ్యాను. ఉద్యోగం దొరకలేదు. అయిదుపైసలు ధర్మంచేయండి బాబూ!"

ఆ అట్టముక్కను చూసిన చంద్రం అత్యద్భుతంగా ఆశ్చర్యచకితుడైనాడు; అంతేకాదు మరునిముషంలోనే మొదటి ప్రశ్న ఎగిరిపోయి, రెండోప్రశ్నకు సమాధానం సుముఖంగా దొరికినట్లయింది. సత్వరం ఇంటికి పరుగెత్తుకెళ్ళాడు.

గుడిసెముందు ఖాళీరిక్షా నిలబడే వుంది. మల్లయ్య లోపల అన్నం తింటున్నాడు. తండ్రితో చెప్పకుండానే చంద్రం రిక్షా ఎక్కి బజారుకేసి తొక్కసాగాడు.

అప్పుడే ఎంగిలిచేయి కడుక్కునేందుకు బయటికొచ్చిన మల్లయ్యా, భర్త చేతిమీద నీళ్ళుపోయడానికి చెంబు తెచ్చిన ఆయనభార్యా — కొడుకు రిక్షాను వడిగా తొక్కుకెళుతూండడాన్ని చూసి గుండెలు క్రుళ్ళిన దుఃఖంతో ఒకళ్ళ మొహా లొకళ్ళు చూసుకున్నారు.

———